
# పోతనభాగవతంలో రసగుళికలు



– ఆర్.శర్మ దంతుర్తి

## 101 వ భాగం

# భగవంతుడి అవతార వైభవం, కృష్ణావతారం

కిందటి నెల వ్యాసంలో రామావతారం గురించి చదివాం. ఇప్పుడు చెప్పబోయేది కృష్ణావతారం. రామావతారం లో రాముడికి తానో అవతారపురుషుణ్ణి అని తెలియదుట. 'ధర్మం ఆచరించడం ఒకటే తాను చేసేది, నేను దశరధుడి కొడుకుని, రాముడనే మానవమాతృణ్ణి,' అంటూ యుద్ధం అయ్యాక వరం ఇస్తాను కోరుకో అనే శివుడితో అంటాడు, "ఆత్మానాం మానుషం మన్యే రామం ధశరధాత్మజం" అని. అయితే కృష్ణావతారంలో తాను ఇలా ధర్మస్థాపనకి పుట్టిన భగవంతుణ్ణి అనే ఎరుక ఉంది. కానీ ఎక్కడ ఎవరికి ఎంత ఎలా మర్యాద ఇవ్వాలో లోకంలో ధర్మ బద్ధంగా బతకడానికి ఎలా ఉండాలో అనేవి చేసి చూపించినవాడు కృష్ణుడు. అవసరం అయితే నోళ్ళు మూయించడానికి మొత్తం రాజ్యాలే లేపేసే రకం.

సీ. తాపసోత్తమ! విను దైత్యాంశములఁ బుట్టి
నరనాథు లతుల సేనాసమేతు
లగుచు ధర్మేతరులై ధాత్రిఁ బెక్కు బా
ధల నలంచుటఁ జేసి ధరణి వగలఁ
బొందుచు వాపోవ భూభార ముడుపుట
కై హరి పరుఁడు నారాయణుండు
చెచ్చెరఁ దన సితాసిత కేశయుగమున
బలరామ కృష్ణ రూపములఁ దనరి [2-173]

తే. యదుకులంబున లీలమై నుదయ మయ్యె
భవ్యయశుఁ డగు వసుదేవు భార్యలైన
రోహిణియు దేవకియు నను రూపవతుల
యందు నున్మత్తదైత్య సంహారి యగుచు [2-173.1]

భూదేవి (ధాత్రి) అనేక బాధలు అనుభవిస్తోందిట – అనేకమంది రాక్షస గుణాలతో అధర్మంగా ప్రవర్తిస్తూ ఉండడం వల్ల. ఆవిడ వెళ్ళి మొరపెట్టుకుంది. సరే పద, నేనే వస్తున్నా వీళ్ల అంతు చూడ్డానికి (దైత్య సంహారి యగుచు) అంటూ అవతారం ధరించాడు. ఎలా? సితాసిత కేశయుగమున – అంటే తెల్లని జుట్టుతో ఒక రకంగా (బలరాముడు), నల్లని జుట్టుతో మరో రకంగా (కృష్ణుడు). ఎవరికి జన్మించాడంటే, వసుదేవుని భార్యలైన రోహిణి, దేవకి అనే రూపవతులకి.

ఈ రూపవతుల సంగతి కొంచెం చూద్దాం. నీలమేఘశ్యాముడు కదా రాముడు. ఆయన్ని చూడగానే వళ్ళు మర్చిపోయి అలాగే చూస్తూ ఉండేవారుట జనం. కృష్ణుడిది మరో మెట్టు పైకి. ఆయనని చూస్తే అసలు ప్రపంచంలో ఇంకేమీ గుర్తు ఉండదుట జనాలకి. ఈయన ఎంత అందగాడంటే పదహారువేలమంది భార్యలు కూడా ఈ కృష్ణుడు నాకోసమే ఇలా ఈ రంగులో ఈ గుణాలతో పుట్టాడు అనుకునేవారుట. అలా పుట్టడానికే రూపవంతులైన రోహిణీ దేవకీ లకి జన్మించాడన్నమాట. అయితే నల్లగా ఉన్నవాళ్ళు అందంగా ఉంటారా అనే ప్రశ్న వస్తే సమాధానం ఏమిటంటే ద్రౌపది నల్లటిదే, అలాగే చాలా మంది అందగత్తెలనే వారు కృష్ణశ్యాములే. కృష్ణుడు గోప బాలకులతో ఆడుకుంటున్నప్పుడు వచ్చి చూసిన మునులు కూడా 'ఈ కుర్రాడేమిటి గోపాలుడేమిటి?' అనుకుని కళ్ళు మూసుకుని చూస్తే 'ఓహో ఇదా సంగతి, ఈయన సాక్షాత్తూ భగవంతుడే' అని తెలిసేదిట. అయితే కృష్ణుడు మాత్రం ఆ మునుల కాళ్ళు పట్టుకుని 'మీకేం కావాలో చెప్పండి, చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను' అంటూ చేతులు కట్టుకుని నిలుచునేవాట్ట. అలా తానెవరో పూర్తిగా తెలిసినా లోకం కోసం ఎలా మెలగాలో జనాలకి చూపించడానికి మర్యాదగా ఉండేవాడు. ఇదే విషయం మరో సారి చెప్తున్నాడు కింద బ్రహ్మ నారదుడితో.

వ. ఇట్లు పుండరీకాక్షుం డగు నారాయణుండు సమస్త భూభార నివారణంబు సేయం దన మేనికేశద్వయంబ చాలునని యాత్మ ప్రభావంబు దెలుపుకొఱకు నిజకళాసంభవులైన రామకృష్ణుల దేహవర్ణంబులు శ్వేతకృష్ణం బని నిర్దేశించుకొఱకు

సితాసితకేశద్వయ వ్యాజంబున రామకృష్ణాఖ్యల నలరి యవతరించె నందు భగవంతుడును సాక్షాద్విష్ణుండును నైన కృష్ణుండు జనమార్గవర్తి యయ్యును నతిమానుష్యకర్మంబుల నాచరించుటం జేసి కేవల పరమేశ్వరుం డయ్యె; నమ్మహాత్ముం డాచరించు కార్యంబులు లెక్కపెట్ట నెవ్వరికి నలవిగాదు అయినను నాకు గోచరించిన యంత యెఱింగించెద వినుము. [2-174]

సమస్త భూభారం తొలగించడానికి తన రెండు వెంట్రుకలు (తెలుపు, నలుపు) చాలు అనుకున్నాట్ట. అలా బలరామ కృష్ణులుగా అవతరించాడు. సాక్షాత్తూ విష్ణువే కృష్ణుడు, మానవరూపం ధరించి అందరి మనుషుల్లాగానే బతికినా మానవాతీతమైన కార్యాలు చేయడం వల్ల పరమేశ్వరుడయ్యాడు. కృష్ణుడు చేసిన పనుల్లో కొన్ని చెప్తున్నాడిప్పుడు.

క. నూతన గరళస్తని యగు
పూతనఁ బురిటింటిలోనఁ బొత్తుల శిశువై
చేతనముల హరియించి ప
రేతనగరమునకు ననిచెఁ గృష్ణుఁడు పెలుచన్. [2-175]

పుట్టింట్లో ఇంకా పొత్తిళ్లలో ఉండగానే విషంతో చంపడానికి పూతన వస్తే, ఆవిడ ప్రాణాలు తోడేసి (చేతనముల హరియించి) యమలోకానికి (పరేత నగరమునకు) పంపాడు.

పూతన మీద చిన్న కథ చెప్పుకుని ముందుకి వెళ్దాం. బలి మహారాజు కథ తెల్సిందే కదా? కులగురువు శుక్రాచార్యులు వద్దు అంటున్నా, నిరయంబైన నిబంధమైన ధరణీ నిర్మూలంబైన... అంటూ వామనుడికి అడిగిన మూడడుగులూ దానం ఇచ్చాడు. అప్పుడు అక్కడే ఉండి చూస్తున్న బలి చక్రవర్తి కూతురికి వామనుణ్ణి చూసి ముచ్చటవేసి ఇటువంటి కుర్రాణ్ణి కని సాకాలి అనుకుందిట. అలా పూతన అనే రాక్షసిగా పుట్టి కృష్ణుడికి పాలు ఇచ్చింది అంటారు. అయితే రాక్షసత్వం పోలేదు కనక అలా పుట్టింది కంసుడికి సేవ చేయడానికి. పూతన చనిపోయాక దాని శవాన్ని బయటకి తీయడానికి ముక్కలుగా నరికి మంట పెడితే అందులోంచి సువాసన వచ్చిందిట. ఇదేమి వింత అనుకున్నప్పుడు నారదుడు చెప్తాడు విశేషం. భగవంతుడు ఆవిడ వంట్లో విషాన్నే కాదు రాక్షసత్వం తో పాటు చెడు గుణాలన్నీ పీల్చేసాడు. ఇంక మిగిలినవి మంచివే. అందుకే అలా సువాసన వచ్చింది అని.

క. వికటముగ నిజపదాహతిఁ
ప్రకటముగా మూఁడు నెలల బాలకుఁడై యా
శకటనిశాటుని నంతక
నికటస్థునిఁ జేసె భక్తనికరావనుఁడై [2-176]

మూడు నెలల వయసులో శకటాసురుణ్ణి (నిశాటుడు – రాక్షసురుడు) చంపాడు. ఎలాగంటే, కాలి దెబ్బతో (పదాహతి) అంతకనికటస్థుని చేస్తూను (యమునికి సమీపంగా). ఎందుకంటే కృష్ణుడు భక్తులని కాపాడేవాడు కనక. ఈ పద్యంలో నికరావనుఁడై అంటే నికర – సమూహం, అవనుడు – కాపాడేవాడు.

క. ముద్దుల కొమరుని వ్రేతల
రద్దులకై తల్లి ఱోల రజ్జులఁ గట్టం
బద్దులకు మిన్నుముట్టిన
మద్దుల వడిఁ గూల్చె జనసమాజము వొగడన్ [2-177]

ఈ పద్యంలో మన పోతన మరోసారి చూపించాడు తెలుగుతో ఎలా ఆడుకొవచ్చో. ముద్దుల కుమారుడి అల్లరి అరికట్టడానికి (వ్రేతల రద్దులకై) తల్లి రోలుకి కట్టేసింది. అయితే పద్దులకు (పట్టుదలతో) ఆకాశాన్నంటే (మిన్ను ముట్టిన) మద్దిచెట్లని ఆ రోలుతో కూల్చేసాడు. దీనిమీద కూడా మరో చిన్న కథ.

కుబేరుడి కొడుకులైన నల కూబర మణిగ్రీవులనేవారు అహంకారంతో ఆయనతో పరిహాసంగా కబుర్లు ఆడితే నారదుడు శపిస్తాడు మద్దిచెట్లై ఉండండి హరినామస్మరణం చేస్తూ అని. కృష్ణుడు అవతారంగా వచ్చేదాకా అలా ఎండకి ఎండుతూ వానకి నానుతూ పడి ఉంటాయన్నమాట. శాపవిమోచనం అయ్యాక కృష్ణుడు చెప్తాడు – ఇన్నాళ్ళూ చేసిన నామస్మరణం వల్ల ముందు ముందు మంచి గతులు కలుగుతాయి, జాగ్రత్తగా ఉండండి అని. ఇందులో నేర్చుకోవల్సింది ఏమిటంటే అహంకారంతో చేసే పనుల వల్ల ఎన్నేళ్ళు, ఎంతటి దుఃఖం అనుభవించాలో అనే విషయం. ఈ అహంకారం అనే విషయం మరో సారి ఈ వ్యాసం చివర్లో చూద్దాం.

మ. మదిఁ గృష్ణుండు యశోదబిడ్డఁ డని నమ్మంజాల యోగీంద్ర త
ద్వదనాంభోజములోఁ జరాచర సమస్తప్రాణిజాతాటవీ
నద నద్యద్రి పయోధి యుక్త మగు నానా లోకజాలంబు భా
స్వ దనూనక్రియఁ జూపెఁ దల్లికి మహాశ్చర్యంబు వాటిల్లఁగన్ [2-178]

ఇప్పుడు బ్రహ్మ మరో సారి చెప్తున్నాడు – ఇటువంటి అద్భుతాలు చేసిన కృష్ణుడు యశోద కొడుకు అంటే నమ్మలేకపోతున్నాను. అయితే ఇదికాక మరొకటి ఉంది. ఒకనాడు తన నోటిలో (మన్ను తిన్నావా నోరు చూపించు అంటే), నదినదాలతో, సముద్రాలతో ఉన్న పధ్నాలుగు లోకాలనీ చూపించాడు, తల్లి మహాశ్చర్యం పొందేలాగా.

చ. వర యమునానదీ హ్రద నివాసకుఁడై నిజ వక్త్ర నిర్గత
స్ఫురిత విషాంబుపానమున భూజనులన్ మృతిఁ బొందఁ జేయు భీ
కర గరళద్విజిహ్వుఁ డగు కాళియ పన్నగు నా హ్రదంబుఁ జె
చ్చెర వెడలించి కాచె యదుసింహుఁడు గోపకగోగణంబులన్ [2-179]

భీకరమైన విషంతో యమునానదిలో ఉంటూ అక్కడి జనాలని చంపుతూ ఉండే కాళీయుడనే సర్పం (ద్విజిహ్వుడు – రెండు నాలుకలు కలవాడు, సర్పము) ఉండేది. దాన్ని మదం అణిచి అక్కడనుంచి వెళ్లగొట్టాడు. ఇందులో కృష్ణుణ్ణి పోతన ఏమన్నాడో గమనించారా? యదు సింహుడు. కాళీయమర్ధనం లో కూడా పోతన కృష్ణుడు మడుగులో దూకినపుడు వర్ణించడానికి వాడిన పదం ఇటువంటిదే – గోపాల సింహంబు.

మ. తనయా గోపకు లొక్క రేయితఱి, నిద్రం జెందఁ గార్చిచ్చు వ
చ్చినఁ గృష్ణా మము నగ్నిపీడితుల రక్షింపం దగుం గావవే
యనినం గన్నులు మీరు మోడ్వుఁ డిదె దావాగ్నిన్ వెసన్నార్తు నే
నన వారట్ల యొనర్ప మ్రింగె శిఖిఁ బద్మాక్షుండు లీలా గతిన్ [2-180]

గోపాలురందరూ ఓ రాత్రి నిద్రలో ఉండగా కార్చిచ్చు తరుముకుంటూ వచ్చింది. లేచిన అందరూ రక్షించమని అడిగితే 'మీరంతా కళ్ళు మూసుకోండి నేను చూస్తాను దీని సంగతి' అన్నాడు. వాళ్ళు కళ్ళు కూసుకోగానే ఆ కార్చిచ్చుని (శిఖి) ని మింగేసాడు, ఆటాడుకున్నట్టుగా (లీలాగతిన్).

క. మందుని గతి యము నాంబువు
లందు నిసిం గ్రుంకి బద్ధుఁడై చిక్కిన యా
నందుని వరుణుని బంధన
మందు నివృత్తునిగఁ జేసె హరి సదయుండై. [2-181]

ఓ రాత్రివేళ యమునానదిలో స్నానం చేస్తూ అక్కడ నీళ్లలో చిక్కుకున్నాడు నందుడు. అప్పుడు కృష్ణుడు ఆయనని వరుణుని బంధంలోంచి దయతో విడిపించాడు, అంటే నీళ్లలోంచి రక్షించాడు.

ఈ నెల వ్యాసం ముగించేముందు అహంకారం గురించి చెప్పుకుందాం. ఇస్కాన్ (ISKCON) వారి రోమపాద స్వామి గారు "అహంకారం పోగొట్టుకోవడం ఎలా?" అనేదానికి సమాధానం. 'అన్నీ భగవంతుడైన కృష్ణుడే ఇచ్చాడు, అంతా ఆయన తప్ప మరేమీ లేదు' అనుకుంటూ ఉండాలి. అయితే దీనికి అభ్యాసం అవసరం కదా అందరికి అంత సులభంగా కుదరదు; మరోదారి ఏదైనా ఉందా? ఉంది. ఏ వస్తువు, ఆస్తి వల్ల మనకి మమకారం అహంకారం కలుగుతున్నాయో అవి కృష్ణుడు ఇచ్చినవే కనక ఏ నిముషంలోనైనా ఆయన వాటినన్నింటినీ వెనక్కి తీసుకుంటాడనే విషయం గుర్తుంచుకోండి. అలా ప్రయత్నం చేస్తూ అహంకారం దూరం చేసుకోవచ్చు. మొత్తం భాగవతం అంతా చెప్పేది ఇదే. భగవంతుడికీ భక్తుడికీ మధ్య ఉండే అగాధం అహంకారం. అది పోయిన మరుక్షణంలో ఎదురుగా నీలమేఘశ్యాముడు కనిపిస్తాడు, మనోహరంగా నవ్వుతూ.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS